క్లుప్తంగా

ఇన్‌స్పెక్షన్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ రెడ్డి నాయక్

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ ఎస్ఐగా డాక్టర్ రెడ్డినాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నాగేంద్ర కర్నూలు హెడ్‌క్వార్టర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎమ్మిగనూరు టౌన్ స్టేషన్ నుంచి రెడ్డినాయక్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రత పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మంటలను అదుపులచేయడంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: ఇళ్లలో వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపిస్తే అప్రమత్తంగా వ్యవహరించి అరికట్టాలని స్థానిక ఫైర్ శాఖ అధికారి జి.రామాంజనేయులు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోనున్న అరవింద్ అపార్ట్‌మెంట్‌లో వంటగ్యాస్ లీకై మంటలు వ్యాపిస్తే ఎలా అదుపు చేయాలో అపార్ట్‌మెంట్ వాసులకు ప్రదర్శన ద్వారా వివరించారు.

వెరిఫికేషన్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రుద్రగౌడ, చిత్రంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ

కోసిగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో మంత్రాలయం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3 కర్నూలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ స్థానిక తహసీల్దార్ రుద్రగౌడతో కలిసి బుధవారం సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ..మండలంలో 62 పోలింగ్ బూత్ ఉన్నాయని అందులో ఫాం-6, ఫాం-7, ఫాం-8లలో పెండింగ్ ఉన్న వాటిని వెంటనే వెరిఫికేషన్ చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ఐలు తిక్కస్వామి, శ్రీరాములు, జూనియర్ అసిస్టెంట్ పరుశురాములు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

గ్యాస్‌తో అప్రమత్తంగా ఉండాలి



మంటలు ఆర్పే విధానాన్ని చూపిస్తున్న అగ్నిమాపక అధికారి

ఆదోని అర్బన్: గ్యాస్‌పై వంటకాలు చేసేటప్పుడు మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని ఆదోని అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్, సహాయ జిల్లాధికారి రామాంజనేయులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 3వ రోజు బుధవారం స్థానిక నారాయణగుంత కాలనీలో అగ్ని ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. మహిళలు వంట చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ లీకేజీ జరిగినప్పుడు, ఆ లీకేజీ వల్ల మంటలు చెలరేగినప్పుడు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో దానిపై గ్యాస్ సిలిండర్‌పై మంటలు ఆర్పే విధానాన్ని డెమో వేసి సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.మహబూబ్‌బేగ్, పంపాపతి, చిదంబర్‌రెడ్డి, రాజశేఖర్, రంగస్వామినాయుడు, అనిల్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని 15 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.28,73,739ల విలువైన చెక్కులను వైద్య చికిత్సలు చేయించుకున్న వారికి బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



హోసూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్ : ధ్యానాన్ని దినచర్యగా అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందని సినీ ఫైట్ మాస్టర్‌లు రామ్,లక్ష్మణ్‌లు అన్నారు. బుధవారం మండలంలోని హోసూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాత్మా యోగి నరసింహస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలో శాఖాహారం-అమృత ఆహారం ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ..ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత సిద్ధిస్తుందన్నారు. శాఖాహారాన్ని తినడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. పిరమిడ్ మాస్టర్‌లు పెద్దయ్య, వెంకట్రాముడు, నారాయణ, ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

అవిశ్వాసంలోనూ విశ్వాసం చూపారు

● మున్సిపల్ పాలకవర్గ సభ్యులను ప్రశంసించిన మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంలోనూ కౌన్సిలర్లు విశ్వాసం చూపారని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రశంసించారు. అవిశ్వాసానికి మద్దతు పలికి చైర్‌పర్సన్‌ను గద్దె దింపారని, అందుకు ప్రతిఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎస్కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నపై నమ్మకం, వైఎస్సార్‌సీపీపై ఉన్న ప్రేమ, ఆప్యాయతలు, విలువలు, విశ్వసనీయత, నిజాయితీను కౌన్సిలర్లు చాటుకున్నారన్నారు. పాలకవర్గ సభ్యులకు, పట్టణాభివృద్ధికి వ్యతిరేకంగా వ్యవహరించిన చైర్‌పర్సన్ బోయ శాంతపై అవిశ్వాస తీర్మానం పెట్టి గద్దె దించడంలో పాలకవర్గ సభ్యులు పార్టీకి మద్దతుగా నిలిచారన్నారు. ఆదోనిలో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చారన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం

అభివృద్ధి అంటే ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉర్దూ వసతి గృహం, బైపాస్ రోడ్డు తదితర శాశ్వతమైన పనులను తమ ప్రభుత్వ హయాంలోనే చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ప్రజలను మభ్య పెడుతున్నారే తప్పా అభివృద్ధి శూన్యమన్నారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతు పనులు చేపట్టడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. తాగునీటిని అందించే ఎస్ఎస్ ట్యాంకుల నిర్వహణ, తుంగభద్ర దిగువ కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకులో నీటిని నింపుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. కూటమి నేతల దౌర్జన్యాలు పట్టణంలో పెట్రేగిపోతున్నాయని ఆరోపించారు. ఇలాంటి దౌర్జన్యాలు ఎప్పుడూ జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీపై తప్పుడు ఆరోపణలు చేయడం ఎమ్మెల్యేకు తగదన్నారు. చనిపోయినట్లు చిత్రీకరించి భూకబ్జాలు చేయడం, ఆధార్‌కార్డులు మార్ఫింగ్ చేయడం, ఇంటి స్థలాలను ఆక్రమించుకోవడం లాంటి దుర్మార్గాలను పక్కనపెట్టి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ఆగిపోయిన మెడికల్ కళాశాల, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ తదితర పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, నగరూరు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను తొలగించాలి

ఎమ్మిగనూరుటౌన్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ,రాహుల్ గాంధీపై నేషనల్ హెరాల్డ్ పేరుతో పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఖాశింవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు.బుధవారం పట్టణంలోనున్న ప్రధాన పోస్టల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రాన్ని పోస్టల్ అధికారి దివాకర్‌కు అందజేశారు. షబ్బీర్,ఆసిఫ్, జైపాల్,రఫీక్,దాదావలి,హర్ష,విజయ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

గోనెగండ్ల: మండలంలోని చిన్నమరివీడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ మణిమంజరి బుధవారం తనిఖీ చేశారు. ఫాంపాండ్, నీటి తొట్టెల పనులను, మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పనుల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన కొలతల ఆధారంగా పనులు చేసుకుంటే గరిష్ట వేతనం లభిస్తుందని చెప్పారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం త్వరగా పనులకు వెళ్లి త్వరగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. అనంతరం చీని తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏపీఓ మహమ్మద్ బాషా, ఈసీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

కూలీల కడుపు కొడుతున్న సర్కారు



మాట్లాడుతున్న విరుపాక్షిరెడ్డి

నందవరం : ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించక కూటమి సర్కారు వారి కడుపులు కొడుతోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి అన్నారు. బుధవారం ముగతి గ్రామంలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు నెలలుగా వేలది మంది కూలీలు పనులు చేశారని, దాదాపు రూ.3 కోట్లకు పైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నందవరం మండలంలో రూ.1.90 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కూలి సక్రమంగా రాకపోతుండటంతో అధిక శాతం కుటుంబాల పోషణకు వలస బాట పడుతున్నారన్నారు. ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలోని సమస్యలపై దృష్టి సారించడం లేదని మండిపడ్డారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, తారకరాముడు, రాజు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ఆదోని అర్బన్: ఈనెల 18న స్థానిక మల్లికార్జున విద్యాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అల్కూరు మఠం సిద్ధయ్యస్వామి స్వచ్ఛందసేవా సంస్థ సభ్యుడు అల్కూరు మహర్షి విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జంగమ అర్చక సమాఖ్య, శ్రీ అల్కూరు మఠం సిద్ధయ్యస్వామి స్వచ్ఛందసేవా సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న వైద్యశిబిరంలో కర్నూలు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించనున్నారన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు భారతి నిలయం పాఠశాలలో పేర్లు నమోదు చేసుకుని టోకెన్ చేసుకోవాలన్నారు. ఈసీజీ, 2డీ ఎకో పరీక్షతో పాటు ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, కిడ్నీ, పళ్లు, కళ్లు, బీపీ, షుగర్ తదితర జబ్బులకు వైద్య సేవలు అందించనున్నారన్నారు.

సొంతగూటికి విద్యాకమిటీ మాజీ చైర్మన్



మాజీ ఎమ్మెల్యేను కలిసిన విద్యాకమిటీ మాజీ చైర్మన్ ఉలిగప్ప, నాయకులు శ్రీనివాసులు

ఆదోని రూరల్: మేజర్ పంచాయతీ మండిగిరి గ్రామానికి చెందిన విద్యాకమిటీ మాజీ చైర్మన్ ఉలిగప్ప, సీనియర్ నాయకులు శ్రీనివాసులు బుధవారం సొంతగూటికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని తన నివాసంలో కలిసి పూలమాలలు వేసి సన్మానించారు. వారిని సాయిప్రసాద్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏదో చేస్తుందని ఆశించి తమ పార్టీ నాయకులు కొంతమంది టీడీపీలో చేరారన్నారు. నెలలు గడుస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడంతో తిరిగి తమ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. మండిగిరి మాజీ సర్పంచ్ శేషిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీలో చేరిన ఉలిగప్ప, శ్రీనివాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పార్థసారథి ప్రజలకు మంచి చేస్తారని నమ్మి ఆయన వెంట నడిచామన్నారు. అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ఒక్క అభివృద్ధి, సంక్షేమ పథకం ప్రజలకు అందకపోవడంతో తిరిగి సొంత పార్టీ వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో మండిగిరి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కడితోట ఈరన్న, తురువగల్లు రాజు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను దోచుకునేందుకే కుట్ర



సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ బిల్లును దురుద్దేశంతో తెచ్చారని, వక్ఫ్ భూములను దోచుకోనేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న,కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఖాశింవలి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం ఆయా పార్టీల ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు బీజేపీ సబ్‌క వికాస్,సబ్‌కా సాత్ అని ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన తరువాత ముస్లింలపై కక్షసాధింపు చర్యలకు పూనుకొందన్నారు. ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్ రద్దు, సీసీఏలను ఇప్పుడు వక్ఫ్ బోర్డ్ బిల్లు చట్ట సవరణ చేసిందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, బీహర్ సీఎం నితీష్ కుమార్ రాబోవు రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దాదావలి,ఖాజ, తిమ్మగురుడు,ఇస్మాయిల్ ,మాలిక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డులో విద్యార్థికి స్థానం



హెచ్‌బీ ఐజాక్ న్యూటన్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని కిడ్డీస్ రూట్స్ గ్లోబల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న హెచ్‌బీ ఐజాక్ న్యూటన్ గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నాడు. డిసెంబర్ 1న విజయవాడలోని హల్లేల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 1,046 మంది ఒకే సమయంలో సంగీత పరికరమైన కీబోర్డు వాయించి గిన్నిస్ రికార్డు నెలకొల్పాడు. కార్యక్రమంలో తల్లిదండ్రులు హెచ్‌ఈడీ సుధాకర్, ఎం.సురేఖతో కలిసి పాల్గొన్నాడు. ఈనెల 14న హైదరాబాద్‌లో హల్లే సంగీత స్థాపకుడు అగస్టీన్ దండిగి చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్స్ జి.కేవనారాయణరెడ్డి, చిన్నప్పరెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

వేలం పకడ్బందీగా నిర్వహించాలి

నందవరం : మండలంలోని నాలగదిన్నె గ్రామంలో గురువారం వేలాన్ని పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కేశవ పంచాయతీ అధికారులకు సూచించారు. బుధవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందితో వేలం నిర్వహణపై ఎస్ఐ సమావేశం నిర్వహించారు. గ్రామంలో సంత మార్కెట్, కబేళా, బండిమెట్ట వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాసన్న తెలిపారు. బహిరంగ వేలంలో ఆసక్తి గల వారు పాల్గొన్న వచ్చన్నారు. గ్రామ పెద్దలు తిమ్మప్ప, కిషోర్, రంగయ్య శెట్టి పాల్గొన్నారు.

ఘనంగా కందుకూరి వీరేశలింగం జయంతి



వీరేశలింగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం జయంతిని స్థానిక కిడ్డీస్ పాఠశాలలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు రచయితలు మాట్లాడుతూ తెలుగులో అనేక నూతన సాహిత్య ప్రకియలు మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఘనత కందుకూరికే దక్కుతుందన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు ఎం.ప్రేమ్‌కుమార్, అరసం ఉపాధ్యక్షులు కె.సి.మల్లికార్జున, సోమభూపాల్, సహాయ కార్యదర్శి బి.నాగన్న, దాసరి వెంకటేష్, గుడ్ల రామాంజి తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారంలో తీవ్ర నీటి ఎద్దడి



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

గోనెగండ్ల: మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోర్లకు నీరు అందకపోవడంతో నీటి సమస్య తీవ్రమైంది. బీసీ, ఎస్సీ కాలనీల్లో నీటి సమస్య మరింత తీవ్రంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో 5వేల మంది జనాభా ఉంది. నీటి కోసం గ్రామస్తులు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న బావులు, బోర్లను ఆశ్రయించి బైకులు, తోపుడు బండ్లపై బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. బుధవారం నుంచి గ్రామంలో దుర్గమ్మ దేవర ప్రారంభం కావడంతో ప్రతి ఇళ్లు బంధు, మిత్రులతో కిటకిటలాడుతున్నాయి. ఉన్న వారికే నీటికోసం అవస్థలు పడుతుంటే వచ్చిన బంధువులందరి నీటి అవసరాలు తీర్చడానికి స్థానికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి అధికారులు రెండు రోజులుగా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ దేవరకు వచ్చిన వారికి ఇవి సరిపడటం లేదు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలోని బోర్లకు నీరు అందకపోవడంతో నీటి సమస్య ఉన్నది వాస్తవమే.. దేవరకు గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నామని చెప్పా. కాగా.. దేవర వేడుకల్లో మంచి నీటి సమస్యను పరిష్కరించేందుకు బుట్టా ఫౌండేషన్ ముందుకొచ్చింది. మంచినీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి గ్రామస్తులను నీటిని సరఫరా చేయిస్తున్నారు.

దాతలకు సర్టిఫికెట్ల అందజేత



దాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి

ఆదోని సెంట్రల్: స్థానిక ఆర్‌టీపీసీ ఆర్ ల్యాబ్ వద్ద క్షయవ్యాధిగ్రస్తులకు నిత్యం పోషకాహారాన్ని అందిస్తున్న దాతలకు బుధవారం డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓ సత్యవతి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తులకు మానవతా దృక్పథంతో దాతలు పోషకాహారాన్ని అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం దాతలు మహమ్మద్‌ఫయాజుద్దీన్, నిరంజన్‌కుమార్, నిస్సిమానిక, ఎస్టీస్, ఎస్టీల్ఎస్ భాస్కర్, వీరేష్‌లకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు షేకున్‌భాను, సిబ్బంది స్వరూప్ రాజ్‌కుమార్, ఎస్‌టీఎస్ లలితమ్మ, ఎంపీహెచ్ఎస్ఎఫ్ సుబ్బమ్మబాయి, టీబీహెచ్‌వీ పద్మావతమ్మ పాల్గొన్నారు.

పిల్లలకు క్రమం తప్పక టీకాలు ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పక టీకాలు ఇవ్వాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు చెప్పారు. బుధవారం ఆయన స్థానిక ఎన్టీఆర్ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న సచివాలయంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు వేసిన పిల్లలు, గర్భిణుల వివరాలను యూవిన్ పోర్టల్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో మాతాశిశు సేవలు బలోపేతం చేయడంలో భాగంగా కిల్కారి మెసేజ్ విధానం ప్రారంభించారన్నారు. బండిమెట్ట యూపీహెచ్‌సీ పరిధిలోని గని వీధి అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి డెమో శ్రీనివాసులు శెట్టి వివరించారు. అనంతరం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ముషాహిద్ చౌదరి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీదేవి, ఆరోగ్య కార్యకర్త ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్త ఆషియా బేగం పాల్గొన్నారు.

పంచాయతీ సాధారణ సమావేశం వాయిదా

ఆలూరు రూరల్: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో జరగాల్సిన సాధారణ సమావేశం బుధవారం నిరవధికంగా వాయిదా పడింది. సర్పంచ్ అరుణాదేవి, 16 మంది వార్డు సభ్యులు గైర్హాజరు కావడంతో సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప తెలిపారు. బుధవారం జరగాల్సి సమావేశంలో మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా, పంచాయతీ వేలాల దక్కించుకున్న వారి నుంచి నగదు వసూలు, గ్రామంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలు,అభివృద్ధి పనులు, సంత మార్కెట్‌లోని షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణ షాపు నిర్వాహకుల నుంచి అద్దె వసూలుపై అజెండాలో చర్చించాల్సి ఉంది.

అద్దె చెల్లించకుంటే మరో సారి వేలాలు

మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంత మార్కెట్‌లో ఉన్న 27 షాపులను వేలాల్లో దక్కించుకుని ముందస్తుగా ఏడాది అద్దె చెల్లించని వారు, గ్రామ పంచాయతీ మార్కెట్ వేలాలు దక్కించుకుని 50 శాతం నగదు చెల్లించకుంటే ఈ నెలాఖరులోగా మరోసారి బహిరంగ వేలాలు నిర్వహిస్తామని డీఎల్‌పీఓ స్పష్టం చేశారు. షాపింగ్ కాంప్లెక్సులోని 27 షాపుల్లో 12 మంది మాత్రమే ముందస్తు అద్దె చెల్లించారని, మిగిలిన 15 మంది చెల్లించాల్సి ఉందన్నారు.

చెత్తాచెదారం తొలగించండి



కొత్త పేట కాలనీకి వెళ్లే రోడ్డుపై వేసిన చెత్తాచెదారం

కోసిగి: స్థానిక కొత్త పేట కాలనీకి వెళ్లే రోడ్డులోనే చెత్తాచెదారం రోడ్లపై వేసి అపరిశుభ్రంగా మార్చేస్తున్నారు. కాలనీకి చాలా ఏళ్ల నుంచి మెటల్ రోడ్డు మాత్రమే ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చొరవతో సీసీరోడ్డు, డ్రైయినేజీ ఏర్పాటు చేయించారు. అయితే ప్రస్తుతం ఆరోడ్డంతా చెత్తా చెదారంతో నిండిపోయి అపరిశుభ్రంగా మార్చేస్తున్నారని, కనీసం నడవడానికి కూడా వీలు లేనట్లుగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి శుభ్రం చేయాలని కోరుతున్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న దుర్గమ్మ ఆలయం,(ఇన్‌సెట్) పూజలందుకుంటున్న దుర్గమ్మ

వైభవంగా దుర్గమ్మ దేవర




ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోనెగండ్ల: మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో దుర్గమాత దేవరను బుధవారం గ్రామ ప్రజలు వైభవంగా నిర్వహించారు. భక్తులు కుంభాలతో ఊరేగింపుగా వెళ్లి బలిదానం సమర్పించి పూజలు చేశారు.వేడుకలకు గ్రామం నుంచే కాక కర్నూలు, ఆదోని తదితర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డికు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనస్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, నాయకులు ప్రమోద్ కుమార్ రెడ్డి, తిరుమల రెడ్డి, నాగిరెడ్డి, గిరిష్ రెడ్డి, జైపాల్ రెడ్డి, బుట్టా రంగయ్య, లక్ష్మీనారాయణ, నాగేష్, వెంకట్రాముడు, యేసురత్నం, రవి ప్రకాష్ రెడ్డి, శాంతి రెడ్డి, పరమేష్, మౌలాలి, గోపాల్, నాగభూషణ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, హనుమంత్ రెడ్డి, ఎంకన్న, చంద్ర, రంగారెడ్డి, వీరేష్, కేశవ రెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు చలువ పందిళ్లు, షెడ్ల ఏర్పాటు



లడ్డు కౌంటర్ల వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు.



నవగ్రహాల మంటపం వద్ద ఏర్పాటు చేసిన షెడ్డు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రధానంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. రూ.4లక్షలతో ప్రధాన తూర్పు ద్వారం వద్ద రెండు, లడ్డూ కౌంటర్ల వద్ద ఒకటి చలువ పందిళ్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఆలయ మహా ప్రాకారంలో లోపల భక్తుల విడిది కోసం నాల్గు వైపుల 60-40 అడుగుల వెడల్పుతో నలువైపులా నాలుగు షెడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రధాన రాజగోపురం రెండు వైపుల షెడ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఇందుకు ఇప్పటి వరకు రూ.12లక్షలు ఖర్చు చేశామన్నారు. పశ్చిమ భాగంతో పాటు నైరుతి భాగంలో కూడ మరో రెండు షెడ్లను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. భక్తులకు ఆలయం లోపలి భాగంలో తాగునీటి వసతి కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలోనే 52గదుల నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. బెంగళూరుకు చెందిన ఓ భక్తుడు రూ.2కోట్లతో కోనేరు నిర్మాణానికి ముందుకొచ్చాడని త్వరలోనే నిర్మాణం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. బసవన్న ఆలయ పునర్నిర్మాణానికి రూ.45లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.